సేవలకు సెలవేనా!

- దిష్టిబొమ్మల్లా మారిన కియోస్క్ యంత్రాలు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు సేవలు
- నేడు పట్టించుకోని కూటమి సర్కారు
- సాంకేతిక లోపాలతో మూలకు చేరిన వైనం

రంగంపేట: విత్తనం నుంచి పంట విక్రయం వరకూ అన్నదాతలకు ప్రతి అడుగులో అండగా నిలబడాలనే సదాశయంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రైతు భరోసా కేంద్రాలను (ఇప్పుడు రైతు సేవాకేంద్రాలు) ఏర్పాటు చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అవసరమైన రైతులు వచ్చి అక్కడి సిబ్బందికి ముందస్తుగా నగదు చెల్లించేవారు. అక్కడి కియోస్క్ యంత్రం ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఆ తరువాత ఎవరికి ఏ రకం కావాలో తెప్పించే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ కేంద్రాల్లో అందుబాటులో లేని ఇంటర్నెట్, సాంకేతిక లోపాలతో చాలా చోట్ల కియోస్క్ యంత్రాలు పని చేయడం లేదు.

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో..

రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం మండలంలో 20, కోరుకొండ మండలంలో 24, రాజానగరం మండలంలో 27 రైతు సేవా కేంద్రాలు ఉండగా, వాటిలో 64 కియోస్క్‌లు ఉన్నాయి. అలాగే అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి మండలంలో 20, పెదపూడ మండలంలో 20, బిక్కవోలు మండలంలో 21, రంగంపేట మండలంలో 19 ఆర్‌ఎస్‌కేలు ఉండగా, 79 కియోస్క్‌లను అప్పట్లో ఏర్పాటు చేశారు.

అప్పట్లో ఎన్నో సేవలు

వైఎస్సార్ ప్రభుత్వంలో కియోస్క్‌ల ద్వారా రైతులు విలువైన సేవలు అందేవి. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించేందుకు లక్షల రూపాయలు వెచ్చించి వీటిని కొనుగోలు చేశారు. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు, రైతుల పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెట్ వివరాలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుంది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయ శాఖ అన్ని విధాలా సేవలందించింది. వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్నా సమాచారాన్ని దీనిలో పొందుపరిచారు. నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా ఉన్నాయి.

నిర్లక్ష్యపు నీడలు

కూటమి ప్రభుత్వ హయాంలో రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. ప్రస్తుతం సాంకేతిక లోపంతో కియోస్క్ యంత్రాలు పని చేయడం లేదు. లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతుండగా కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని చోట్ల వీటిని పూర్తిగా విస్మరించారు. మరికొన్ని చోట్ల నెట్ సేవలు అందక పని చేయడం లేదు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులను పూర్తిస్థాయిలో పంపిణీ చేసేవారు. మరి ప్రస్తుతం మొక్కుబడిగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందిస్తున్నారు. దీంతో రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నారు. రబీ సీజన్‌కైనా వీటిని సంపూర్ణంగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కియోస్క్ పనితీరును రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారి (ఫైల్)

ఎరువులు పూర్తిస్థాయిలో ఇవ్వాలి



ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందించలేకపోయింది. మా మండలంలో కియోస్క్‌లను ప్రస్తుతం వినియోగించడం లేదు. ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువులను రైతులు అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగా రైతులకు అవసరమైనప్పుడు అన్ని ఎరువులూ అందించాలి.

– పేపకాయల రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు, రంగంపేట

డిజిటల్ సేవలు అందించాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, మార్కెట్ వివరాలు వంటి సమాచారం రైతులకు డిజిటల్ సేవల ద్వారా తెలియజేసేవారు. అప్పటి లాగే ఇప్పుడు కూడా రైతులకు డిజిటల్ సేవలు అందించాలి.

– వేము చిరంజీవి, మర్రిపూడి, రంగంపేట మండలం

సమస్యలు పరిష్కరిస్తాం



రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు వినియోగంలోనే ఉన్నాయి. విత్తనాల కాలం అయిన తరువాత వాటి వినియోగం తక్కువగా ఉంటుంది. రైతుల సౌలభ్యం కోసం మొబైల్ యాప్ ద్వారా ఎక్కువ సేవలు అందుతున్నాయి. అందువల్ల వీటి వాడకం తగ్గి ఉండవచ్చు. సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరిస్తాం

. – కె. శ్రీనివాసరావు, ఏఓ, రంగంపేట మండలం

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



రఘుదేవపురం హైస్కూల్లో ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు శ్యామల దేవి, ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సోమవారం హైస్కూల్లో విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పాఠశాలలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులను పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. తమకు అన్ని విషయాలు విపులంగా వివరిస్తూ, ఎన్నో పోటీల్లో తమను విజేతలుగా నిలబెడుతున్న ఉపాధ్యాయులను సత్కరించడం సంతోషమని విద్యార్థులు పేర్కొన్నారు.

శ్రీశ్రీకళావేదిక రాష్ట్ర యువజన కార్యదర్శిగా నక్కిన



సీతానగరం: ఐఎస్ఓ గుర్తింపు పొంది, 36 ప్రపంచ రికార్డులు సాధించిన అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన విద్యా, సామాజిక సంస్కర్త నక్కిన ధర్మేష్ నియామక పత్రాలను సోమవారం అందుకున్నారు. శ్రీశ్రీకళావేదిక చైర్మన్ కళారత్న కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా నియామక పత్రాలను అందించారు. పదవి అందించిన చైర్మన్, జాతీయ అధ్యక్షురాలికి కృతజ్ఞతలు తెలిపారు. ధర్మేష్‌ను రాష్ట్రంలోని పలువురు కవులు, రచయితలు, సాహిత్య వేత్తలు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉమామహేశ్వరీదేవిని అభినందిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ తదితరులు

రాజానగరం: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్‌లో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఉమామహేశ్వరీ దేవిని అధికారులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు. యూనివర్సిటీ ఈసీ హాలులో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆమెను దుశ్శాలువాలు, పుష్పమాలలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య .ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ స్వామి, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అందుకున్న కృష్ణబాబు



వీసీ ప్రసన్నశ్రీ నుంచి పీహెచ్‌డీ పట్టా నకలును అందుకుంటున్న కృష్ణబాబు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ నుంచి కృష్ణబాబు సాంబారు పీహెచ్‌డీని పొందారు. 'ఇంపాక్ట్ ఆఫ్ సోషల్ మీడియా మార్కెటింగ్ ఆన్ పర్చేజ్ ఇంటెన్షన్ ఇన్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ గూడ్స్ విత్ రెఫరెన్స్ టు స్మార్ట్ సిటీస్ ఆఫ్ ఏపీ' అంశంపై చేసిన పరిశోధనకు ఈ పీహెచ్‌డీ లభించింది. దీనికి సంబంధించిన నకలును వీసీ ప్రసన్నశ్రీ నుంచి కృష్ణబాబు సోమవారం అందుకున్నారు.

రామాలయం అభివృద్ధికి విరాళం



రామాలయం అభివృద్ధికి విరాళం అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ తదితరులు

పెదపూడి: హిందూ ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం అవసరమని కరకుదురు గ్రామానికి చెందిన సేవాకీయం ట్రస్ట్ అధినేత, చైర్మన్ తలాటం మురళీకృష్ణ అన్నారు. ఆ గ్రామంలో బీసీ పేట రామాలయం అభివృద్ధికి ట్రస్ట్ తరఫున మురళీకృష్ణ, వైస్ చైర్మన్ పాటంశెట్టి త్రిమూర్తులు ఆదివారం రాత్రి రూ.లక్ష విరాళాన్ని ఆలయకమిటీ ప్రతినిధులకు అందించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ పరిసర గ్రామాల్లో ట్రస్ట్ తరఫున సేవా కార్యక్రమాలను మరింత విస్తరించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుబ్బల వెంకటరమణ, జుత్తుక ప్రసాద్, దెయ్యాల సత్తిబాబు, గుబ్బల చిన్న, కోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు ఆరు అర్జీలు



ఎంపీపీ కార్యాలయంలో అర్జీ తీసుకుంటున్న ఏవో సుబ్రహ్మణ్యం

సీతానగరం: గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు వచ్చాయి. సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో మూర్తి ఫిర్యాదులు అందుకున్నారు. కోర్టు పరిధిలో ఉన్న భూమి రికార్డుల్లో మార్పులు, చేర్పులు చేయరాదని మునికూడలికి చెందిన శ్యామ్ సుందర్, తన భూమికి సరిహద్దులు నిర్ణయించి ఎఫ్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ వీరబ్రహ్మం, మునికూడలిలో ఉన్న తన భూమిని ఆక్రమిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా కోడూరు మండలం జున్నూరుకి చెందిన శంకు గంగమ్మ అర్జీ అందించారు. పురుషోత్తపట్నం పంచాయతీ నుంచి వేరు చేసి రామచంద్రపురానికి పంచాయతీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అర్జీని అందించారు. వివాదంలో ఉన్న స్థలాన్ని ఆక్రమణలు జరగకుండా చూడాలని కాటవరానికి చెందిన వెంకటలక్ష్మి, తండ్రి చనిపోయాడని, తన బంగారం, ఆస్తి డాక్యుమెంట్స్ ఆడపడుచు వద్ద ఉన్నాయని, రికార్డుల్లో పేర్లు మార్పులు చేస్తున్నారని బొబ్బిల్లంక-2కు చెందిన లంకమ్మ అర్జీని అందించారు. కార్యక్రమంలో ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత పోరు'కు చలో రాజమహేంద్రవరం

- యూరియా సరఫరాలో కూటమి విఫలం
- నేడు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, రైతులు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు ఏనాడు రోడ్డెక్కలేదన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను ముందుగానే సొసైటీలు, ప్రైవేటు డీలర్ల వద్ద సిద్ధంగా ఉంచిన సంగతిని గుర్తు చేశారు. కూటమి పాలనలో జరుగుతున్న ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు వ్యతిరేకంగా అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఖరీఫ్ పంటలకు అవసరమైన యూరియాతో పాటు పోషక ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సియాటికా ఫిజియోథెరపీపై అవగాహన

రాజానగరం: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయు)లోని ఫిజియోథెరపీ విభాగం ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సహకారంతో సియాటికా ఫిజియోథెరపీపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన డాక్టర్ శ్వేత ప్రసన్న సియాటికా నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, ఈ కోర్సు పూర్తి చేసిన వారికి లభించే అవకాశాలు గురించి హెల్త్ సైన్సెస్ డైరెక్టర్, ఎండీ ధనరాజ్ వివరించారు. ఫిజియోథెరపీ ద్వారా చేకూరే ఆరోగ్య ప్రయోజనాలపై నిర్వహించిన పోస్టర్ ప్రెజెంటేషన్‌లో విద్యార్థులు పోటీపడ్డారు. కార్యక్రమంలో డాక్టర్ డి.కవిత, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

రామవరం, పులగుర్త హైస్కూళ్ల తనిఖీ

అనపర్తి: రామవరం, పులగుర్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంఈవో ఎస్.సత్తిరెడ్డి, కుతుకులూరు క్లస్టర్ హెచ్‌ఎం విజయభారతి సోమవారం తనిఖీ చేశారు. అసెస్మెంట్ పుస్తకాలు, రాత పుస్తకాలు, విద్యార్థుల గ్రేడింగ్, టీచర్ మ్యాడ్యూల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం తదితర విషయాలను పరిశీలించారు. ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె సీతామహాలక్ష్మి ఎఫ్ఏ వన్ పరీక్షలో క్లాస్ టాపర్లకు, క్లాసు లీడర్లకు గుర్తింపు బ్యాడ్జీలు, బహుమతులు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం స్టాఫ్ సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని, లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని క్లస్టర్ ప్రధానోపాధ్యాయిని విజయభారతి అన్నారు. అనంతరం మధ్యాహ్నం రామవరం పాఠశాలలో తనిఖీ నిర్వహించారు.

ఆలయాల సంప్రోక్షణ

అనపర్తి: చంద్రగ్రహణం అనంతరం మండలంలోని ఆలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి సంప్రోక్షణ కార్యక్రమాలు చేశారు. అనపర్తిలోని శివాలయం, విష్ణాలయంతో పాటు మండలం వ్యాప్తంగా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

అక్షరాస్యతతోనే ఆర్థిక అభ్యున్నతి

రాజమహేంద్రవరం సిటీ: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చినప్పుడే ఆ కుటుంబాలు ఆర్థికంగా అభ్యున్నతి చెందుతాయని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కనకరాజు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని మెప్మా పాత కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్ టీచర్లకు సోమవారం శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు చదువుకుంటే, వారి పిల్లల భవిష్యత్తు చక్కగా ఉంటుందన్నారు. 2029 నాటికి ఆంధ్రప్రదేశ్ వంద శాతం వయోజన ప్రాథమిక అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 15-59 ఏళ్ల నిరక్షరాస్యులకు చదవడం, రాయడం, ప్రాథమిక గణితం, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత వంటి అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఇందుకోసం ప్రతి పది మందికి స్వయం సహాయక బృందాల నుంచి ఒక వలంటీర్ టీచర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. శిక్షణ అనంతరం వీరందరూ తమ తమ పరిధిలోని అభ్యాసకులకు క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతను విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం వలంటీర్ టీచర్లకు బోధన పుస్తకాలు అందించారు. అనంతరం ఆయన గోకవరం బస్టాండ్ సమీపంలోని మహిళా మార్ట్, కంబాలచెరువులోని పట్టణ నిరాశ్రయుల వసతిగృహాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సీఎంఎం వి.రామలక్ష్మి, సాంకేతిక నిపుణులు ఎం.ఫణికుమార్, పి.శ్రీదేవి, టీఎంసీ సాయికుమార్ పాల్గొన్నారు.

కోతులతో భయాందోళన

ధవళేశ్వరం: కోతుల బెడదతో ధవళేశ్వరం గొల్లపేట వాసులు బెంబేలెత్తుతున్నారు. గుంపులుగా గుంపులుగా వస్తున్న కోతులతో భయాందోళన చెందుతున్నారు. అవి ఒక్కసారిగా ఇళ్లల్లోకి చొరబడి వస్తువులను పాడు చేయడం, స్థానికులపై దాడి చేసి గాయపరచిన సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. పదుల సంఖ్యలో కోతుల గుంపు సంచరిస్తుండటంతో స్థానికుల ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక గొల్లపేట, వాటర్ ట్యాంకు వీధుల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలోనే పోలవరం కార్యాలయం, పోలవరం స్పెషల్ కలెక్టర్ కార్యాలయం ఉన్నాయి. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు సైతం కోతుల గుంపుతో భయాందోళన చెందుతున్నారు.

పేదలకు నిత్యావసరాల వితరణ



బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న సర్పంచ్ చినబాబు తదితరులు

పెదపూడి: ఏపీత్రయం గ్రామం శివారు ఏటిగట్టుపై నివాసం ఉంటున్న 30 నిరుపేద కుటుంబాలు వరదలకు తీవ్రంగా నష్టపోయాయి. ఆ కుటుంబాలకు స్థానిక రాజుబాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం బియ్యం, నిత్యవసర సరకులు, ఆహార పదార్థాలు అందజేశారు. రామేశ్వరం సర్పంచ్ కొటికలపూడి చినబాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా వృద్ధులు, నిరుపేదలు, పేద విద్యార్థులకు సాయం చేయడం అభినందనీయమని ట్రస్ట్ చైర్మన్ కొమ్ము రాజుబాబును ప్రశంసించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ కేపీఎస్ రాజు, ప్రతినిధులు పలివెల రాజేంద్ర ప్రసాద్, పలివెల రాజేష్ కుమార్, కోశాధికారి కె.మౌనిక పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో దీవెనశ్రీ ప్రతిభ



దీవెనశ్రీని అభినందిస్తున్న హరి ప్రసాద్

అనపర్తి: ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన పదో ఏపీ స్టేట్ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ (2025-26)లో అనపర్తి జీబీఆర్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని ముమ్మిడివరపు దీవెనశ్రీ ప్రణీత కల్యాణి తృతీయ స్థానం సాధించింది. ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని చేవూరు గ్రామంలో గల శ్రీరామదూత స్వామి ఆశ్రమ పాఠశాలలో ఇటీవల ఈ పోటీలు జరిగాయి. దీవెనశ్రీ తూర్పుగోదావరి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపింది. ఈ సందర్భంగా సోమవారం ఆమెను విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంటు తేతలి ఆదిరెడ్డి (కొండబాబు) అభినందించారు. అలాగే జీబీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ జి.హరిప్రసాద్, హైస్కూల్ హెచ్‌ఎం రామారావు, ప్రైమరీ హెచ్‌ఎం భువనేశ్వరి, ప్రీ ప్రైమరీ హెచ్‌ఎం కామాక్షి తదితరులు అభినందించారు.

యూరియా అమ్మకాలు నిలిపివేసిన అధికారులు



భూపాలపట్నం సొసైటీ గోడౌన్‌లో యూరియాను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజానగరం: మండలంలోని భూపాలపట్నం, వ్యవసాయ సహకార పరపతి సంఘంలోని గోడౌన్‌లో ఉన్న యూరియా నిల్వల (స్టాకు)లో తేడాలను గుర్తించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాటి అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మధుబాబు, అసిస్టెంట్ జియాలజిస్టు ఎస్‌వి లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయాధికారి కల్యాణ్ సూర్యకుమార్ రాజానగరం, భూపాలపట్నంలో తనిఖీలు నిర్వహించారు. రాజానగరంలోని మన గ్రోమోర్ దుకాణంలో స్టాకు రికార్డుల ప్రకారం ఉంది. భూపాలపట్నం సొసైటీ గోడౌన్‌లో మాత్రం ఉన్న స్టాకుకు, రికార్డులో చూపిన లెక్కలకు పొంతన లేకపోవడంతో నిల్వ ఉన్న రూ.19,80,980లు విలువ చేసే యూరియా అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశామని సీఐ తెలిపారు.

నానో యూరియాపై అవగాహన అవసరం



నానో యూరియా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఓ మణిదీప్ తదితరులు

పెదపూడి: నానో యూరియాపై రైతులు అవగాహన పెంచుకోవాలని కాకినాడ విభాగం ఐఎఫ్ఎఫ్‌సీఓ మేనేజర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. పెదపూడి పీఏసీఎస్ వద్ద చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, మండల వ్యవసాయశాఖాధికారి ఎన్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ధరిత్రి బచావో కార్యక్రమంలో భాగంగా నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు నానో యూరియా, నానో డీఏపీ లీటర్ డబ్బాలు అందజేశారు. నానో యూరియా గురించి తెలియజేసే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, డీసీసీబీ మేనేజర్ బాను, నీటి సంఘం అధ్యక్షుడు ఆరుమిల్లి వాసు, పీఏసీఎస్ సీఈఓ మంచంశెట్టి దుర్గారావు, ఏఈఓ శ్రీనివాసు గౌడ్, వీఏఏలు దుర్గాప్రసాద్, శరణ్య, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పెదపూడి: ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు అని లయన్స్ క్లబ్ జిల్లా 316బీ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సోమవారం జి.మామిడాడలో తొమ్మిది మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ శ్రీసూర్య ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వజ్రపు కోటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ప్రథమ మహిళ రూప, జిల్లా రెండో ఉప గవర్నర్ పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, జిల్లా పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా ఉత్తమ పీడీ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి, పైన, రాజుపాలెం, జి.మామిడాడ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మరో 8 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ముఖ్య అతిథులు శాలువకప్పి పూలమాలలు వేసి సన్మానించారు. వారు ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు మండ రాజారెడ్డి, పేకేటి సూర్యనారాయణ, ద్వారంపూడి భాస్కరరెడ్డి, రావాడ నాగు, కడిమి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆటోను తప్పించబోయి లారీ బోల్తా



బోల్తాపడిన లారీ



ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం ఇనుప మెట్లు

రాజమహేంద్రవరం రూరల్: ఆటోను తప్పించబోయి లారీ బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే.. బొమ్మూరు జాతీయ రహదారిపై వైఎస్సార్ సెంటర్‌లో ఓ ఆటోను తప్పించబోయే క్రమంలో లారీ.. అక్కడ వైఎస్సార్ విగ్రహ వద్ద ఉన్న ఇనుపమెట్లను ఢీకొంది. అలా ముందుకు వెళ్లి సెలూన్ షాపును ఢీకొట్టి బోల్తాపడిన పడింది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కడియం మండలం దుళ్ల నుంచి విశాఖపట్నానికి అట్టపెట్టెల లోడుతో లారీ వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సంఘటనా స్థలాన్ని బొమ్మూరు పోలీసులు పరిశీలించారు. ఈ ప్రమాదంలో వైఎస్సార్ విగ్రహం ఇనుప మెట్లు, సెలూన్ షాపు ధ్వంసమయ్యాయి.

కడియం ఆస్పత్రిలో సమీక్ష

కడియం: ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధురి, కడియం ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, ముద్రగడ జెమి, ఎంపీడీవో రమేష్, అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చిలుకూరి ప్రభ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురువులను గౌరవించడం అలవర్చుకోవాలి



చంద్రేడు హైస్కూల్ హెచ్‌ఎం రమణబాబును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రంగంపేట: బాల్యం నుంచి గురువులను గౌరవించడం అలవర్చుకుని, ఉత్తమ పౌరులుగా ఎదగాలని కృషి చేయాలని విద్యార్థులకు చంద్రేడు జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గంట రమణబాబు సూచించారు. ఆ పాఠశాలలో సోమవారం నిర్వహించిన గురుపూజోత్సవానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉపాధ్యాయ వత్తి నుంచి రాష్ట్రపతి స్థాయి వరకు ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఉపాధ్యాయులకు స్ఫూర్తి ప్రదాత అన్నారు. అంతకు ముందు సర్వేపల్లి చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రమణ బాబుతో పాటు, ఉపాధ్యాయులు శివరామకృష్ణ, మాణిక్యరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, వీరబాబు, సత్యనారాయణమూర్తి, సీతామహాలక్ష్మి, నాగలక్ష్మిలను విద్యార్థులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు.